క్లుప్తంగా

మాజీ సీఎం జగన్‌ను కలిసిన యడం బాలాజీ

పర్చూరు (చినగంజాం): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని పర్చూరు వైఎస్సార్ సీపీ సమన్వయకర్త యడం బాలాజీ గురువారం కలిశారు. పులివెందులలోని ఆయన స్వగృహంలో కలిసి నియోజక వర్గంలోని పరిస్థితులపై మాట్లాడారు. నియోజక వర్గంలో ప్రజలకు అందుబాటులో ఉండి అక్కడ నిర్వహించే కార్యక్రమాలను సమర్థవంతంగా చేయాలని సూచించారని బాలాజీ చెప్పారు. అనంతరం ఆయనతో పాటు భోజనం చేశారు. కార్యక్రమంలో ఆయనతో పాటు సీనియర్ నాయకుడు కొల్లా వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలపై వినతి



రాధాకృష్ణకు వినతి పత్రం అందజేస్తున్న 104 సిబ్బంది

చినగంజాం: 104 ఉద్యోగుల సమస్యలపై పోరాడేందుకు తమకు సహకరించాలంటూ ఎమ్మెల్సీ వంగవీటి రాధాకృష్ణకు ఉద్యోగులు గురువారం వినతి పత్రం పత్రం అందజేశారు. వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణ నిమిత్తం చినగంజాం వచ్చిన ఆయనను ఉద్యోగులు కలిశారు. గత కొద్ది నెలలుగా జీతాలు రాక ఇబ్బందులు పడుతున్న తమను ఆదుకోవాలని, తమ న్యాయపరమైన డిమాండ్‌లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ వారు వినతి పత్రాన్ని ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో 104 డాటా ఎంట్రీ ఆపరేటర్ పొదిలి రాఘవ, పైలట్ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జెండా ఆవిష్కరణ



సీపీఐ జెండాలు ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు

అద్దంకి రూరల్: సీపీఐ పార్టీ 99 ఏళ్లు పూర్తిచేసుకుని 100 సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా సీపీఐ పార్టీ నాయకులు గురువారం సాయంత్రం అద్దంకిలోని పాత బస్టాండ్ సెంటర్, సంతమాగులూరు, ఎల్చూరు , కొమ్మాలపాడు, అడ్డరోడ్డు, కుందూరు, గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ బాపట్ల జిల్లా కార్యదర్శి సింగరకొండ మాట్లాడుతూ అధికారం ఉన్నా లేకపోయినా నిరంతరం ప్రజల్లో ఉండి కార్మికులు, కర్షకుల కోసం పోరాటం చేశామన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి షేక్ ఖాదర్‌బాషా, అద్దంకి నియోజకవర్గ కౌన్సిల్ సభ్యుడు కాలేషావలి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు అద్దంకి నాగేశ్వరరావు, కరిముల్లా పాల్గొన్నారు.

మందుబాబులకు ఎస్సై కౌన్సెలింగ్



మందుబాబులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై

బల్లికురవ: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై జీవి చౌదరి హెచ్చరించారు. గురువారం బల్లికురవ బస్టాండ్‌లో మద్యం తాగుతున్న వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మద్యం దుకాణాల్లో కొనుగోలు చేసిన మద్యాన్ని ఇంటికి తీసుకెళ్లి తాగాలన్నారు. మద్యం తాగి అల్లర్లకు పాల్పడితే వాహనాలను, వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని ఎస్సై హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, మార్గశిర మాసం విశాఖ నక్షత్రం ద్వాదశి తిథి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

అద్దంకి పురపాలక సంఘ సమావేశం నేడు

అద్దంకి రూరల్: అద్దంకి పురపాలక సంఘ సాధారణ సమావేశం శుక్రవారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాలులో నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ ఎల్ ఎస్తేరమ్మ గురువారం తెలిపారు. సమావేశానికి సభ్యులు హాజరుకావాలని కోరారు.

చెట్టు కింద ఫైర్



సిబ్బంది బట్టలు, సామగ్రి ఉంచే గది



గతంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించిన ఉన్నతాధికారులు (ఫైల్)



వ్యవసాయ మార్కెట్ యార్డులో చెట్ల కింద ఉన్న అగ్నిమాపక వాహనం

- అగ్నిమాపక కేంద్ర నిర్మాణానికి గ్రహణం వీడేనా
- 20 ఏళ్లుగా సొంత కార్యాలయం కోసం ఎదురు చూపులు
- పరాయి పంచలో ఉండి విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- పట్టని అధికారులు, కూటమి ప్రభుత్వం

అద్దంకి రూరల్: ప్రమాదాలేవి చెప్పిరావు.. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో ఎవరికీ తెలియదు. కాని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటే చాలు కొంతమాత్రం అయినా బయటపడొచ్చు. అది ఎలాంటిదైనా మన వ్యక్తిగతంగా తీసుకునే చర్యలతో బయటపడవచ్చు. కాని ఒక్క అగ్ని ప్రమాదం జరిగితే అది మనచేతుల్లో ఉండదు. ఎగిసిపడే మంటలను ఆర్పి అదుపులోకి తెచ్చేందుకు ప్రతి ఒక్కరికీ గుర్తుకు వచ్చేది అగ్నిమాపక కేంద్రం. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే ప్రతి ఒక్కరూ అనే ఒకే ఒక్కమాట ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేశారా అని. అలాంటి అతి ముఖ్యమైన రక్షణశాఖకు అద్దంకిలో రెండు దశాబ్దాలుగా నిలువ నీడలేక చెట్ల కింద నివశిస్తూ, అరుగుల మీద పడుకుని విధులు నిర్వహిస్తున్నారు.

కార్యాలయం కోసం ఎదురు చూపులు..

గతంలో అద్దంకి నియోజకవర్గంలో ఎటువంటి అగ్ని ప్రమాదం సంభవించినా అప్పటి జిల్లా కేంద్రమైన ఒంగోలు నుంచి అగ్నిమాపక వాహనంతో సిబ్బంది రావాల్సిందే. దానికోసం అందరూ ఎదురు చూడాల్సి వచ్చేది. అది వచ్చేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోయేది. దానిని దృష్టిలోఉంచుకుని 2013లో అద్దంకిలో అగ్నిమాపక కేంద్రం మంజూరైంది. నాటి నుంచి నేటి దాకా సరైన స్థలం లేకపోవటంతో స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులోని ఒక ఇరుకు గదిలో సిబ్బంది కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని అగ్నిమాపక దళాన్ని చెట్ల కిందే ఉంచుతున్నారు.

మూలకొక ఇరుకు గదిలో విధుల నిర్వహణ..

గత 20 ఏళ్లుగా అగ్నిమాపక సిబ్బంది వ్యవసాయ మార్కెట్ యార్డులోనే ఉంటూ నిత్యం అవస్థలు పడుతూ విధులు నిర్వహిస్తూనే ఉన్నారు. సిబ్బంది ఉండేందుకు ఒకే గది. అదే ఆఫీసు, అదే విశ్రాంతి గది, అదే స్టోర్‌రూమ్. ఆ గదిలోనే సరిపెట్టుకుంటున్నారు. అప్పటికైనా అధికారులు స్పందించి సొంత భవనం ఏర్పాటు చేయాలని సిబ్బంది కోరుకుంటున్నారు.

రూ. 2.25 కోట్లు నిధులున్నా శూన్యం..

అగ్నిమాపక కేంద్రానికి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 2.25 కోట్లు నిధులు మంజూరు చేసింది. రెవెన్యూ అధికారులు శింగరకొండ సమీపంలోని 25 సెంట్ల స్థలాన్ని కూడా కేటాయించారు. కాని అదే స్థలంలో మాజీ సైనిక ఉద్యోగికి కూడా స్థలం ఉండటంతో ఆటంకం కలిగింది. ఆ విధంగా భవన నిర్మాణం వెనక్కుపోయింది.

ఈ కేంద్రంలో రెండు అగ్నిమాపక వాహనాలు నిలిపేందుకు రెండు షెడ్లు, నీటి కోసం బోరు వసతి, సిబ్బందికి అవసరమైన గదులు, సామగ్రి కోసం గది ఇలా అన్నిహంగులతో ఏర్పాటు చేయాలని తలంచారు. కాని అప్పటి నుంచి ఏదో గ్రహణం పట్టినట్లు అగ్నిమాపక కేంద్రానికి నిర్మాణం ముందుకు సాగడం లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం, అధికారులు చిత్తశుద్ధితో భవన నిర్మాణం పూర్తి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఉన్నతాధికారులకు అంచనాలు పంపాం..



అద్దంకిలో ఫైర్ స్టేషన్ లేకపోవటంతో విధులు నిర్వహించేందుకు ఇబ్బందులు పడుతున్నాం. వ్యవసాయ మార్కెట్ లోనే ఉంటున్నాం. ఒక చిన్నగదిలో ఉంటూ సిబ్బంది పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతం. డ్యూటిలో ఉన్న వారు మార్కెట్ యార్డులోని చెట్ల కింద, అరుగుల మీద ఉండాల్సి వస్తుంది. అగ్నిమాపక వాహనం పెట్టేందుకు సరైన వసతి లేదు. మార్కెట్ యార్డులో సంత జరిగే సమయంలో కాని, వారికి ఏ అవసరం వచ్చిన అగ్నిమాపక వాహనాన్ని చెట్లకింద పెడతున్నాం.

– జీ. వెంకటరావు, ఫైర్ ఇన్‌స్పెక్టర్

అధికారం చేపట్టగానే బాదుడే బాదుడు

- ప్రజలపై కూటమి కరెంటు చార్జీల భారం
- విద్యుత్ శాఖామంత్రి మాటలు హాస్యాస్పదం
- అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి



అద్దంకి: కూటమి ప్రభుత్వం ప్రజలపై కరెంటు చార్జీల భారం మోపిందని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి విమర్శించారు. నేడు అద్దంకి పట్టణంలోని విద్యుత్ కార్యాలయం వద్ద 'వైఎస్సార్ సీపీ పోరుబాట' కార్యక్రమాన్ని నిర్వహించనున్న ధర్నా సందర్భంగా గురువారం ఆయన ప్రెస్ నోట్ విడుదల చేశారు. పైగా స్థానిక విద్యుత్ శాఖ మంత్రి మాట్లాడుతూ విద్యుత్ చార్జీల పెంపునకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే కారణమని చెప్పడం హాస్యాస్పందంగా ఉందన్నారు. అధికారంలోకి రాకముందు మీకు.. చంద్రబాబుకు తెలియలేదా అని ప్రశ్నించారు. నేడు మీరు పెంచుతన్న చార్జీలకు మా ప్రభుత్వం కారణమని చెప్పడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ పథకాలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కూటమి ప్రభుత్వం మరోసారి ప్రజల నడ్డి విరుస్తోందని దుయ్యబట్టారు. ఎన్నికలకు ముందు ఎప్పటికీ విద్యుత్ చార్జీలు పెంచబోమని, ట్రూ అప్ చార్జీలు పూర్తిగా ఎత్తేస్తామని ప్రజలకు ఇచ్చిన హామీని చంద్రబాబు కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కిందని పేర్కొన్నారు. ఎడాపెడా కరెంట్ చార్జీలను పెంచి అధికారంలోకి వచ్చిన మొదటి ఐదు నెలల్లోనే రెండు సార్లు ట్రూఅప్ (సర్దుబాటు) చార్జీలను పెంచింది. అయితే ఇప్పుడు చంద్రబాబు తానేమి ఎన్నికలకు ముందు చార్జీలు పెంచమని హామీయే ఇవ్వలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రజల పక్షాన వైఎస్సార్ సీపీ పోరాటాలకు ఎప్పుడూ సిద్ధంగా ఉందన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుపై పోరుబాట

- నేడు వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ధర్నా

అద్దంకి రూరల్: కూటమి ప్రభుత్వం పెంచిన కరెంట్ చార్జిలకు నిరసనగా అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి ఆధ్వర్యంలో శింగరకొండ రోడ్డులోని విద్యుత్ ఆఫీస్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు హాజరై ధర్నాను విజయవంతం చేయాలలని కోరారు.

చీరాలలో..

చీరాల: వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో కరెంటు చార్జీలు పెంపుపై శుక్రవారం నియోజకవర్గ పరిధిలో వీఆర్ఎస్‌వైఆర్ఎన్ కాలేజీ వద్ద గల విద్యుత్ డీఈఈ కార్యాలయం దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ పాల్గొంటారని క్యాంపు కార్యాలయ ప్రతినిధి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

పర్చూరులో..

పర్చూరు (చినగంజాం): వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రజలపై విద్యుత్ చార్జీల అదనపు భారాన్ని మోపుతున్న కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా నేడు చేపట్టిన 'వైఎస్సార్ సీపీ పోరుబాట' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పర్చూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి యడం బాలాజీ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 9 గంటలకు పర్చూరు వైఎస్సార్ విగ్రహం వద్దకు అందరూ రావాల్సిందిగా ఆయన కోరారు. అక్కడి నుండి బయలు దేరి పర్చూరు విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాలయం వద్దకు బయలుదేరి వెళ్లి వినతి పత్రం ఇస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలకు చెందిన పార్టీ మండల కన్వీనర్‌లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జిల్లా, అన్ని అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

అల్పపీడనంతో అంతా వర్షార్పణం



అంబడిపూడిలో నేలవాలిన వరిపైరును పరిశీలిస్తున్న ఏవో కుమారి



మోటుపల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి భాస్కరరావు



అద్దంకిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏవో వెంకటకృష్ణ

- దెబ్బతిన్న వరి, శనగ, మిర్చి పంటలు

బల్లికురవ: బంగాళఖాతంలో ఏర్పడి అల్పపీడన ప్రభావంతో రైతులు నట్టేట మునిగిపోయారు. మంగళ, బుధ వారాల్లో కురిసిన వర్షాలు, ఈదురు గాలులకు నేలవాలిన వరిపైరును, తడిసిన ఓదెలను గురువారం వ్యవసాయాధికారిణి ఎస్‌వీపీ కుమారి పరిశీలించారు. అంబడిపూడి, గుంటుపల్లి, ముక్తేశ్వరం గ్రామాల్లో పూతదశకు వచ్చిందన్నారు. గాలుల ప్రభావంతో నేలవాలిన పైరును పైకి లేపి 4 నుంచి 5 దుబ్బులు కలిసి కలిపి కట్టాలాన్నారు. రబీలో సాగు చేసిన పంటలను ఈ పంటలో నమోదు చేయించుకోవాలని, రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలని కుమారి కోరారు.

వర్షాలకు ధాన్యాన్ని జాగ్రత్తగా ఉంచుకోవాలి..

అద్దంకి రూరల్: గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ధాన్యాన్ని జాగ్రత్త కాపాడుకోవాలని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. గురువారం అద్దంకి సమీప పాలాల్లో తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడిసిన ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని తెలిపారు. గ్రేడ్- ఏ రకం క్వింటాల్‌కు రూ. 2320 చెల్లిస్తుందని, తేమశాతం 17 లోపు ఉండేటట్లు చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏలు సాయిబాబు, కోటేశ్వరరావు, శేషారావు, చింతా వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వర్షపు నీటిని బయటకు పంపాలి..

చినగంజాం: మండలంలోని వర్షాలకు దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయాధికారి కే భాస్కరరావు పరిశీలించారు. ఇందులో భాగంగా మోటుపల్లి, పెదగంజాం రెవెన్యూ గ్రామాల్లోని వరి పంటలను సందర్శించి పరిశీలించారు. వాటితో పాటు కడవకుదురు, సంతరావూరు, గొనసపూడి, చింతగుంపల్లి గ్రామాల్లో విత్తిన శనగ పంటలను సందర్శించి పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని బయటకు పంపించేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా రైతులకు ఆయన సూచించారు.



కోలలపూడిలో వర్షానికి తడిసిన వరి ఓదెలు చూపుతున్న రైతు లోకేశ్వరరావు

మార్టూరు: మండలం కోలలపూడి గ్రామంలో రైతులు కోసిన వరి పంట ఓదెలు నాన్చుడు వర్షపు ప్రభావం వలన కొంత నష్టం వాటిల్లినట్లు రైతులు తెలిపారు. మండలంలో ఇంతవరకు కురిసిన వర్ష ప్రభావం వలన పంటలకు పెద్ద నష్టం ఏమీ వాటిల్లలేదని ఏవో కిరణ్ కుమార్ తెలిపారు.

వంగవీటి రంగా సేవలు మరువలేనివి



చీరాలలో రంగా వర్ధంతి నిర్వహిస్తున్న నాయకులు

పర్చూరు (చినగంజాం): వంగవీటి రంగా సేవలు మరువలేనివని పలువురు అభిమానులు పేర్కొన్నారు. పర్చూరులో వంగవీటి మోహన రంగా 36వ వర్ధంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. పర్చూరులోని స్థానిక బొమ్మల సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన ప్రజా సేవల గురించి నాయకులు వివరించారు. తదనంతరం అక్కడికి వచ్చిన అభిమానులకు దాత లింగిశెట్టి రామాంజనేయులు సహకారంతో అన్నదాన వితరణ చేశారు. కార్యక్రమంలో నాయకులు కోట శ్రీనివాసరావు, లింగిశెట్టి రామాంజనేయులు, గోగుల పూర్ణచంద్రరావు, కంచనపల్లి రమేష్, కాల్వ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

చీరాలలో..

చీరాల: నియోజకవర్గంలో వంగవీటి మోహనరంగా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కొత్తపేట శ్రీరామమందిరం వద్ద గల జనసేన పార్టీ జెండా దిమ్మె వద్ద కాపు నాయకులు దాసరి రాము రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాపు నాయకులు తన్నీరు ప్రసాద్ మాట్లాడుతూ వంగవీటి మోహన రంగా కాపులకే కాక దళిత బహుజన వర్గాలకు కూడా నాయకుడని అన్నారు. అనంతరం చీరాల ఏరియా వైద్యశాలలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్మంలో వేటపాలెం మండల అధ్యక్షుడు ఉగ్గిరాల మార్కండేయులు, మామిడాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పర్చూరులో రంగాకు నివాళులర్పిస్తున్న అభిమానులు

అన్యాక్రాంత భూములు అప్పగించాలని వినతి

- కూకట్లపలి, గొర్రెపాడు గ్రామాల ఎస్సీ రైతులు జేసీకి వేడుకోలు



జేసీకి ఫిర్యాదు చేస్తున్న దళిత రైతులు

బల్లికురవ: అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను తమకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కూకట్లపల్లి, గొర్రెపాడు గ్రామాల ఎస్సీ రైతులు గురువారం బల్లికురవలో జాయింట్ కలెక్టర్ ప్రకార్ జైన్‌కు విన్నవించారు. కూకట్లపల్లి రెవెన్యూలోని సర్వే నంబర్ 435, 436, 449, 450/4, 459 ప్రభుత్వం నాలుగు దశాబ్దాల క్రితం సుమారు 40 మందికి తలా అరెకరా చొప్పున భూపంపిణీ చేసిందన్నారు. అప్పట్లో వర్షాలు కురవక పంటలు పండకపోవటం వల్ల ఓ దశాబ్ద కాలం పాటు గ్రామం విడిచి వలసలు వెళ్లామన్నారు. తాము గ్రామంలో లేని సమయంలో కూకట్లపల్లి గ్రామానికి చెందిన అగ్రవర్గాలకు చెందిన కొందరు ఈ భూములపై కన్నేసి ఆక్రమించుకున్నారని చెప్పారు. రికార్డుల్లో కూడా తమ పేర్లు ఎక్కించుకున్నారని జేసీకి దళిత రైతులు వివరించారు. గత రెండేళ్లుగా స్పందనలో ఫిర్యాదు చేస్తున్నా ఎలాంటి చర్యలు లేవని వేల్పుల యేబు, తంగిరాల సామేలు, గొల్లపూడి అంజయ్య, ఏ పాపమ్మ, ఎస్ చిన రోశయ్య తదితరులు ఫిర్యాదు చేశారు.

ముసురుతో అన్నదాతల్లో ఆందోళన



కారంచేడు-ఆదిపూడి రోడ్డులో నేలకొరిగిన వరి చేలు

కారంచేడు: మారుతున్న వాతావరణంతో రైతుల కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. గత మూడు రోజుల నుంచి పట్టిన ముసురుతో అన్నదాతల్లో ఆందోళన కలుగుతుంది. ఎడతెరపి లేకుండా వస్తున్న సన్నని వర్షంతో రైతులు తాము సాగు చేసిన పంటలు నాశనం అవుతాయని భయపడుతున్నారు. మండలంలోని కారంచేడు, కుంకలమర్రు, స్వర్ణ, రంగప్పనాయుడువారిపాలెం, తిమిడెదపాడు, ఆదిపూడి ప్రాంతాలలోని వరి చేలల్లో వర్షానికి కొన్ని చోట్ల చేలు నేలకు ఒరిగిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో వరి చేలు నేలకొరిగిపోవడం వలన పంట తాలుగా మారుతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రతి ఏటా పంటలు చేతికందే తరుణంలో వస్తున్న వరదలు, తుఫానులతో పంటలను కోల్పోవాల్సిన పరిస్థితులు ఉంటున్నాయని వారు వాపోతున్నారు. ధాన్యం కూడా తడిచి రంగు మారిపోయినా ధరలు ఉండవని రైతులు చెప్తున్నారు. ప్రభుత్వం స్పందించి వరి రైతులను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

కార్మికుల జీతాల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ నాయకులు

అద్దంకి రూరల్: గతేడాది సమ్మె సందర్భంగా ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని సీఐటీయూ నాయకులు పీ. తిరుపతి రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్ల సేవలకు తగిన జీతం ఇవ్వటంలో ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారన్నారు. కనీస వేతనం రూ.26 వేలతో పాటు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని కోరారు. కార్మికుడు మృతి చెందినప్పుడు మట్టి ఖర్చులు ఇవ్వడంతోపాటు వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత నెలనుంచి ఔట్ సోర్సింగ్ కార్మికులకు వేతనాలు ఇవ్వలేదని వారు ఆర్థికంగా అప్పులపాలై అవస్థలు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సీవో నంబర్ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు ఆదాము, భీష్మ, సామేలు తదితరులు పాల్గొన్నారు.

పురాతన రామాలయంలో రామ భజన

చినగంజాం: వందేళ్లుగా మూతపడి ఉన్న సీతారామస్వామి ఆలయం పునఃనిర్మాణాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో గురువారం హరేరామ నామ సంకీర్తన కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ముందుగా సీతారాముల విగ్రహాలు ఉంచిన భావన్నారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో బాలాలయం నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా సీతారామస్వామి ఆలయం వద్దకు వెళ్లి ఆలయ ప్రాంగణంలో హరే రామనామ సంకీర్తన 108 సార్లు జపించి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు. ఆలయంలో గురువారం నుంచి మొదలుకొని 41 రోజుల పాటు 41 భజన బృందాలచే భజనా కార్యక్రమాలను నిర్వహించి అనంతరం ఆలయ పునఃనిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వలివేటి వెంకట రామానుజం, మోటుమర్రి రామసుబ్బారావులు తెలిపారు. భజన అనంతరం భక్తులందరికీ ఆలయ కమిటీ వారు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మహిళా భక్తులు విశేషంగా పాల్గొన్నారు.